ముమ్మరంగా అభివృద్ధి పనులు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రూ.77.17 లక్షలతో రహదారుల నిర్మాణం


25వ డివిజన్‌లో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 25వ డివిజన్ పరిధిలో రూ.77.17 లక్షలతో నిర్మించిన రహదారులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి ఎమ్మెల్యే విష్ణు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాడు-నేడు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో డివిజన్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని స్థాయిల్లోనూ తెలుగుదేశం ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. రహదారులకు కేటాయించిన నిధులను సైతం గత పాలకులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. దీంతో రోడ్ల నిర్వహణ అధ్వానంగా తయారైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల మరమ్మతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో మాదిరిగా కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టకుండా.. అనతికాలంలోనే ప్రారంభోత్సవాలు చేసి ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. చాపరాల వారి వీధి, ఐనవోలు వారి వీధి, మూర్తి వీధి, గార్లపాటి వారి వీధి, ఆంజనేయ స్వామి గుడి వీధుల్లో పూర్తయిన రహదారులు తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో కుప్పా వారి వీధి, షేక్ మొహిద్దీన్ వీధి, కాంగ్రెస్ ఆఫీస్ ఎదురు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. జానీ వీధి, మసీదు వీధుల్లో రూ.15 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచనున్నట్లు వివరించారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఈ వెంకటేష్, నాయకులు బంకా భాస్కర్, బంకా బాబీ, రఫీ, అబ్దుల్ నజీర్, నాగేశ్వరరెడ్డి, అలీ అన్సారీ, లక్ష్మణ, యక్కల మారుతి, విద్యావతి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ఓ సువర్ణ అధ్యాయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు


ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీలోని 265వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బీహెచ్ఎస్వీ జానారెడ్డిలతో కలిసి ఆయన సి బ్లాక్‌లోని 480 గడపలను సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా లేదా, స్థానిక సమస్యలపై ప్రజలను ఆరాతీశారు. స్థానిక ప్రజలు తెలిపిన సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

జగనన్న సురక్ష విజయవంతం

జగనన్న సురక్ష కార్యక్రమం నభూతో నభవిష్యత్ అని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. టీడీపీ మూడు సార్లు అధికారంలో ఉన్న ఇటువంటి ఒక మంచి కార్యక్రమాన్ని అయినా చంద్రబాబు చేపట్టారా.. అని ప్రశ్నించారు. సెంట్రల్ నియోజకవర్గంలో 96 సచివాలయ పరిధిలో 1,03,399 కుటుంబాలను వలంటీర్లు సర్వే చేసి వారి అభ్యర్థనలను నమోదు చేశారని, వీటి పరిష్కారానికి 23 క్యాంపులు ఏర్పాటుచేసి 36,367 మందికి పలు సర్టిఫికెట్లను అందించామని తెలిపారు. కార్యక్రమ విజయవంతం కావడంలో అన్ని శాఖల్లోని ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల కృషి అభినందనీయమని కొనియాడారు. కార్పొరేషన్ డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేలను 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. సెవెన్ అపార్ట్‌మెంట్ వద్ద నివసిస్తున్న కుంభ వాకిలయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను కార్పొరేటర్ అందజేశారు. నాయకులు అలంపూరు విజయ్, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 3న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీన 39వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ క్రియాశీలక సభ్యులు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఈవని శ్రీరామచంద్రమూర్తి, తణుకు రామకృష్ణ, పెద్దిభొట్ల కాశీ విశ్వనాథం శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ అన్ని వయసుల వారికి, అర్చక పురోహితులకు, దివ్యాంగులు, ద్వితీయ వివాహం వారికి ఈ పరిచయ వేదికలో అవకాశం ఉంటుందని ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సత్యనారాయణపురం శివాలయం ఎదురుగా కల పాదు క్షేత్రంలో 94407 51646, 98485 36386 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కళాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడకల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అలంకరణ పోటీలను బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. సృజనాత్మకతతో అమ్మవారిని సుందరంగా అలంకరించిన పోటీదారులను, నిర్వాహకులను అభినందించారు. డెప్యూటీ మేయర్ శ్రీశైలజ మాట్లాడుతూ శ్రావణమాసం మహిళలకు ప్రీతి పాత్రమైనదన్నారు. నిర్వాహకురాలు దూపటి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతీ ఏటా సాంస్కృతిక సంక్షేమ సంఘం ద్వారా అనేక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల్లో సరుకుల విక్రయాలు


విక్రయాలను ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా విజయవాడ రామకృష్ణాపురం త్రినేత్ర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో నిత్యావసర సరుకుల విక్రయాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి బి.అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు గ్యాస్ ఆధారిత సేవలకు మాత్రమే పరిమితమైన ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా వినియోగదారులకు అవసరమైన నిత్యావసర సరుకుల విక్రయాలను ప్రారంభిస్తున్నామన్నారు. వినియోగదారులు తమకు అవసరమైన నిత్యావసర సరుకులను గ్యాస్‌తో పాటు ఆర్డర్ చేయటం ద్వారా ఇంటి వద్దనే సరుకులు తీసుకోవచ్చునని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తాము ఐటీసీ, డాబర్, పతంజలి వంటి ప్రముఖ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. త్వరలోనే మరిన్ని కంపెనీలతో ఒప్పందం చేసుకోవటంతో పాటు అన్ని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల్లో విక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్పీజీ జనరల్ మేనేజర్ యోగరాణి సురేష్, ఎల్పీజీ డివిజనల్ సేల్స్ హెడ్ జే మాధవి, టి.భాస్కరరావు, ఎంఎస్ విజయ్‌కుమార్, త్రినేత్ర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత పిన్నంరాజు త్రిమూర్తిరాజు, ఏపీ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గిరిజాశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు వీసాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హోటల్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక బావాజీపేట సి కన్వెన్షన్ హాల్‌లో యునైటెడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యాన విజయవాడ ×సంయుక్త- ఎ టాలెంట్ ఫెస్ట్ 2023 । పేరిట సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. విదేశీ విద్య ద్వారా నిరుపేదలు సైతం ఇతర దేశాల్లో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. యునైటెడ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని అందుకే దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్స్‌లో తమ సంస్థ ద్వారా 20 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే విష్ణు చేతుల మీదుగా వీసాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, యునైటెడ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జె.జగదీష్, అడ్మిన్ మేనేజర్ ఉషా కంచెర్ల, అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డలకు శ్రేయస్కరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లి పాలు బిడ్డలకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం భానునగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని పేర్కొన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వడం తల్లీ బిడ్డలు ఇద్దరికీ ఎంతో ప్రయోజనకరమని వివరించారు. ఏఎస్ఎం కుమారి మాట్లాడుతూ.. తల్లి పాలలో ఉండే పోషకాలు బిడ్డ ఎదుగుదలకు దోహదం చేస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టగానే తల్లి ముర్రుపాలు తప్పకుండా తాగించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి కె.భవాని, నాగ దుర్గా భవాని, మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం


సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతదేశంలో అన్ని వ్యవస్థల్లోనూ, రంగాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఏఐడీఆర్ఎం జాతీయ సమితి సమావేశాల సందర్భంగా రిజర్వేషన్లపై శనివారం సెమినార్ జరిగింది. సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలంటే అన్ని రంగాల్లోనూ ఆయా వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. న్యాయవ్యవస్థలో దశాబ్దాలుగా ఒక కులం ఆధిపత్యం సాగిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన కేబినెట్‌లో ఎస్సీ, బీసీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. మాజీ జడ్జి పి.గురవప్ప మాట్లాడుతూ న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు ఏ రామమూర్తి, జాతీయ కార్యదర్శి వి.ఎస్.నిర్మల్, దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌లు మాట్లాడుతూ.. జడ్జి నియామకాలపై సామాజిక పొందిక ఉండాలన్నారు. న్యాయస్థానాల్లో జడ్జిల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలని సెమినార్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఉద్యమంలో ఇది తొలి అడుగు కావాలని ఆకాంక్షించారు. సెమినార్‌లో సీపీఐ రాష్ట్ర నాయకులు దోనేపూడి శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, నాయకులు బుట్టి రాయప్ప, కుమారి నంద, ఏసురత్నం, కొరివి వినయ్ కుమార్, జి.నటరాజ్, ఏఐటీయూసీ నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే పుంగనూరు విధ్వంసకాండ

ఎమ్మెల్యే మల్లాది విష్ణు


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పుంగనూరులో జరిగిన విధ్వంసానికి మూల కారకుడు ప్రతిపక్ష నేత చంద్రబాబేనని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంగళ్లలో పథకం ప్రకారమే తెలుగుదేశం నేతలు విధ్వంసం సృష్టించారన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారని ఈ ఘటనతో మరోసారి రుజువైందని చెప్పారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ సీపీని నేరుగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు పాల్పడుతూ భయానక వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చివరకు శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులపైనే కర్రలతో దాడికి తెగబడి తలలు పగులగొట్టడం, వాహనాలను తగులబెట్టడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రేరేపించిన దాడిలో అనేక మంది పోలీసులు తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు. పక్కా ప్లాన్ ప్రకారం కాకపోతే కార్లలో గన్‌లు పెట్టుకుని టీడీపీ నేతలు రావాల్సిన అవసరం ఏముందని ఎమ్మెల్యే విష్ణు ప్రశ్నించారు. ఓ వైపు ఆయనే అల్లర్లు సృష్టిస్తూ.. మరో వైపు తనకు భద్రత కల్పించాలని పార్లమెంట్‌లో ఎంపీల చేత చంద్రబాబు అడిగించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టుల గురించి మాట్లాడే ధైర్యం లేకే చంద్రబాబు ఇటువంటి కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని మల్లాది విష్ణు అన్నారు. హింసను ప్రేరేపించే విధంగా చంద్రబాబు వీధి రౌడీలా ప్రవర్తించారన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రి అయి ఉండి కేబినెట్ మంత్రి గూర్చి ఏవిధంగా మాట్లాడాలో బాబుకు కనీసం తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు మాట్లాడిన మాటలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయని చెప్పారు. పుంగనూరులో టీడీపీ దమనకాండను పార్టీలకతీతంగా ప్రజాస్వామ్యవాదులందరూ ఖండిస్తుంటే.. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాత్రం నిమ్మకునీరెత్తినట్లు ఉండటం శోచనీయమన్నారు. గవర్నర్ వ్యవస్థను రద్దుచేయాలని గతంలో మాట్లాడిన తెలుగుదేశం నేతలు.. మరలా ఏ మొహం పెట్టుకుని గవర్నర్‌ను కలిశారో సమాధానం చెప్పాలని మల్లాది నిలదీశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడటం ప్రభుత్వం బాధ్యతని.. కచ్చితంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇబ్రహీంపట్నం, జి. కొండూరు మండలాల్లో హెచ్‌సీఎల్, బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గెయిల్ వంటి పెట్రోలియం, గ్యాస్ సంబంధించిన కంపెనీలు ప్రమాదాలు జరిగే కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కంపెనీల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల నివారణకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో జాతీయ స్థాయిలో జరిగిన దుర్ఘటనలపై సభ్యులతో చర్చించి అవగాహన కల్పించారు. అగ్ని మాపక సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎస్.నాగమణమ్మ, ఏసీపీ కె.వి.డి.వి ప్రసాద్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

16 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణ విభాగం కన్వీనర్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో ట్యాలీ ఇన్ అడ్వాన్స్‌డ్, ట్యాలీ ఇన్ జీఎస్టీ, ఎంఎస్ ఆఫీస్, పేజ్‌మేకర్ అండ్ ఫొటోషాప్, ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్ బీఐ, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్స్, సీ లాంగ్వేజ్, పైథాన్ తదితర కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 14వ తేదీలోగా 0866 2578044 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రామరాజు కోరారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా ఫ్రూట్స్ డే వేడుకలు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఫ్రూట్స్ డే వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రీ స్కూల్ చిన్నారులు పండ్లు, వాటి ప్రాముఖ్యతను గురించి రకరకాల పండ్ల వేషధారణతో పండ్లు.. వాటి పోషక విలువలు, వాటి ప్రయోజనాలను ముద్దు, ముద్దు మాటాలతో ముచ్చటగా వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీకౌలస్య ఫ్రూట్స్ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. ప్రతి రోజు ఒక ఫ్రూట్ తినడం వలన ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం చిన్నారులకు ఫ్రూట్స్ సలాడ్ అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రెసిడెంట్ మోకినా సుమన్, సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, వైస్ ప్రిన్సిపాల్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై హర్షాతిరేకాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ బీసీల చిరకాల కోరికగా మిగిలిన బీసీ కమ్యూనిటీహాలు నిర్మాణానికి నగరపాలకసంస్థ కౌన్సిల్ ఆమోదించటం బీసీల పట్ల ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ పెనుమత్స శిరీషల చిత్తశుద్ధిని తెలియజేస్తుందని పలువురు బీసీ నేతలు అన్నారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా ఉండే జీఎస్ రాజు రోడ్డులో దోబీఖానా పక్కన నిరుపయోగంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతంలో బీసీల కమ్యూనిటీ హాలు నిర్మించాలని గడప, గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి, ప్రతిపాదనలు పంపించి కౌన్సిల్‌లో ఆమోదింప చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ పెనుమత్స శిరీషలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కొండూరు ఏసుబాబు, కె.సాంబయ్య, ఏ విజయ్, సాయి, కలవకోల్లు వెంకటేశ్వరరావు, నక్కా గోవిందు, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఫ్రెండ్ షిప్ డే వేడుకలు



పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్రెండ్ షిప్ డే వేడుకలను మాస్టర్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు శనివారం వినూత్నంగా నిర్వహించారు. చెట్లతో స్నేహం చేస్తూ వాటిని పరిరక్షించాలని తెలుగు తల్లి పార్కులోని చెట్లకు విద్యార్థులు ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లను కట్టారు. కాలుష్యం బారి నుంచి కాపాడేవి చెట్లను ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలన్నారు. భావితరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించడానికి మన వంతు కృషి చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అజిత్‌సింగ్‌నగర్ ఎస్ఐ దుర్గాదేవి చెప్పారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ సర్కిల్ వద్ద ఆటో డ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. కొంతమంది ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల వారితో పాటు ఆటోలోని ప్రయాణికులకు, వారి పక్కన వెళ్లే వాహనదారులకు అనేక నష్టాలు కలుగుతున్నాయన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, రోడ్లపై ఇష్టం వచ్చినట్లుగా వాహనాలను నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ఆటోడ్రైవర్లు కచ్చితంగా ఖాకీ దుస్తులు ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు, ఆర్టీఏ నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలను పాటించని వారిపై జరిమానాలు విధించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగరానికే తలమానికం




విజయవాడ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నగరానికే తలమానికంగా నిలుస్తున్నాయి. స్వరాజ్యమైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ స్మృతివనం పనులతో పాటు కృష్ణలంకలో రిటైనింగ్ వాల్ సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి నగర వాసులతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ